మౌనంగా ఉన్నారంటే..

సెబీ చీఫ్ మాధవి పురి బచ్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ కొత్త సందేహాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై తాజాగా వచ్చిన అక్రమాల ఆరోపణలపై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ కొత్త అనుమానాలను లేవదీసింది. ఇంత జరుగుతున్నా మాధవి పురి ఏం మాట్లాడకుండా ఉన్నారంటే ఏదో జరిగే ఉంటుందన్నట్టు వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోతే ఎందుకీ మౌనం? అంటూ ప్రశ్నించింది. సెబీ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఆయా కంపెనీల నుంచి చెల్లింపులు జరిగాయని, అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు మాధవి పురిపై వస్తున్న విషయం తెలిసిందే. కాగా, అదానీ అక్రమాలపై గత ఏడాది సంచలన రిపోర్టును తీసుకొచ్చిన హిండెన్‌బర్గ్.. ఈ వ్యవహారంలో సెబీ చీఫ్‌గా మాధవి పురి, ఆమె భర్తకూ లింకులున్నాయని గత నెల బయటపెట్టిన సంగతి విదితమే. దీన్ని అదానీ గ్రూప్, పురి దంపతులు కొట్టిపారేశారు.

కార్వీ ఖాతాలు జప్తు

కార్వీ స్టాక్ బ్రోకింగ్, ఆ సంస్థ సీఎండీ సీ పార్థసారథిలకు చెందిన బ్యాంక్-డీమ్యాట్ ఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్‌ను జప్తు చేయాలని గురువారం సెబీ ఆదేశించింది. దాదాపు రూ.25 కోట్ల బకాయిల వసూలుకుగాను ఈ ఆదేశాలు జారీ చేసింది. క్లయింట్ల నిధులను పవర్ ఆఫ్ అటార్నీ దుర్వినియోగంతో కాజేసిన కేసులో భాగంగానే సెబీ ఈ చర్యలకు దిగింది.

తొలిసారి 83,000కు సెన్సెక్స్

ఇంట్రా-డేలో దాటిన సూచీ

1,440 పాయింట్ల వృద్ధితో రికార్డు హై 82,963 వద్ద ముగింపు

నిఫ్టీ సైతం 470 పాయింట్లు పెరిగి మొదటిసారి 25,389 దగ్గరకు

ఒక్కరోజే రూ.6.59 లక్షల కోట్లు ఎగిసిన మదుపరుల సంపద

తిరుపతి బాలాజీ భళా

మార్కెట్‌లోకి ప్రవేశించిన తొలిరోజే శ్రీ తిరుపతి బాలాజీ అగ్రో ట్రేడింగ్ కంపెనీ లిమిటెడ్ షేర్లు అదిరిపోయే లాభాలను సొంతం చేసుకున్నాయి. ఏకంగా 17.51 శాతం చొప్పున విలువను పెంచుకున్నాయి. ఇష్యూ ధర రూ.83గా ఉంటే బీఎస్‌ఈ లిస్టింగ్ రూ.92.90 వద్ద జరుగడం గమనార్హం. దీంతో ట్రేడింగ్ మొదట్లోనే 11.92 శాతం వృద్ధి దక్కింది. మదుపరులు ఈ షేర్లను కొనేందుకు విపరీతమైన ఆసక్తి చూపడంతో చివరకు రూ.97.54 వద్ద ముగిసింది. దీంతో 17.51 శాతం పెరిగినట్టైంది. గురువారం ట్రేడింగ్ సమయం ముగిసే నాటికి సంస్థ మార్కెట్ విలువ రూ.795.64 కోట్లుగా ఉన్నది. కెమికల్స్, అగ్రోకెమికల్స్, ఫుడ్ మైనింగ్, వేస్ట్ డిస్పోజల్ ఇండస్ట్రీ, వ్యవసాయ పరిశ్రమలు, లూబ్రికెంట్స్, వంటనూనెలు తదితర రంగాల్లో ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

467 లక్షల కోట్లకు..

స్టాక్ మార్కెట్ల భారీ లాభాలతో మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో ఎగిసింది. గురువారం ఒక్కరోజే బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.6,59,895.19 కోట్లు పెరిగి రూ.4,67,36,045.21 కోట్ల (5.57 ట్రిలియన్ డాలర్ల)కు చేరింది. వచ్చే వారం జరిగే పాలసీ సమీక్షలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న అంచనాలు.. దాదాపు అన్ని షేర్లకు కొనుగోళ్ల మద్దతునిచ్చాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సీ అన్నారు.

ఉదయం ఆరంభం నుంచే దూకుడు మీదున్న మదుపరులు.. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూపోయారు. ఈ క్రమంలోనే మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ తొలిసారి 83,000 స్థాయిని అధిగమించింది. ఆఖరి గంటలో జరిగిన ట్రేడింగ్‌లోనైతే 1,593.03 పాయింట్లు లేదా 1.95 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 83,116.19 వద్దకు వెళ్లింది. అయితే ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో చివరకు 1,439.55 పాయింట్లు లేదా 1.77 శాతం పెరుగుదలతో ఆల్‌టైమ్ హై 82,962.71 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 470.45 పాయింట్లు లేదా 1.89 శాతం ఎగబాకి లైఫ్‌టైమ్ హై 25,388.90 వద్ద నిలిచింది. అయినప్పటికీ ఇంట్రా-డేలో 514.9 పాయింట్లు లేదా 2 శాతం పుంజుకొని మొదటిసారి 25,433.35 స్థాయిని తాకింది.

ముంబై, సెప్టెంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం రికార్డులతో హోరెత్తించాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ.. రెండూ సరికొత్త ఇంట్రా-డే, క్లోజింగ్ హైలను నమోదు చేశాయి.

రంగాలవారీగా..

బుల్ రన్‌తో దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే స్థిరపడ్డాయి. రంగాలవారీగా చూస్తే.. మెటల్ ఇండెక్స్ అత్యధికంగా 3.05 శాతం పెరిగింది. టెలికం (2.61 శాతం), విద్యుత్తు (2.02 శాతం), ఆటో (1.99 శాతం), యుటిలిటీస్ (1.93 శాతం), కమోడిటీస్ (1.85 శాతం) షేర్లూ రాణించాయి. షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆకట్టుకున్నాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ 0.79 శాతం చొప్పున పెరిగాయి.

కలిసొచ్చిన గ్లోబల్ ట్రెండ్

యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్‌లు వడ్డీరేట్లను తగ్గించబోతున్నాయన్న సంకేతాలు.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టాయి. ఈ జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ కనిపించిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషించారు. ఇక విదేశీ మదుపరుల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పెట్టుబడులు కూడా ఈక్విటీ మార్కెట్లను పరిగెత్తించాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు భారీగా పెరిగాయి. చైనా సూచీ మాత్రం స్వల్పంగా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లూ ఆకర్షణీయ లాభాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి.

అడ్వాన్స్ ట్యాక్స్‌కు టైమైంది

ఈ నెల 15 దాటితే 15% అదనపు పన్ను భారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: ట్యాక్స్‌పేయర్లు అడ్వాన్స్ ట్యాక్స్‌కు సమయం ఆసన్నమైంది. సెప్టెంబర్ 15 సమీపిస్తున్నది మరి. ఈలోగా ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించకపోతే 15 శాతం అదనపు పన్ను చెల్లింపుల భారం తప్పదు. రూ.10,000, ఆపై మొత్తాల్లో పన్నులు చెల్లించాల్సి వస్తున్న వ్యక్తులు, సంస్థలు ప్రతీ ఆర్థిక సంవత్సరం 3 నెలలకోసారి అడ్వాన్స్ ట్యాక్స్‌లు చెల్లించాలన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ నెల 15తో రెండో త్రైమాసికం కోసం చెల్లించాల్సిన గడువు తీరిపోతున్నది. దీంతో ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వర్గాలు ట్యాక్స్‌పేయర్లను అప్రమత్తం చేస్తున్నాయి. సకాలంలో చెల్లించకపోతే ఆలస్యానికిగాను సదరు మొత్తాలపై వడ్డీలను వసూలు చేస్తారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతీ త్రైమాసికం అడ్వాన్స్ ట్యాక్స్‌లను చెల్లించాలి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) కోసం జూన్ 15 డెడ్‌లైన్. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్) కోసం సెప్టెంబర్ 15. మూడు, నాల్గో త్రైమాసికాలకు డిసెంబర్ 15, మార్చి 15 గడువు తేదీలు. ఏటా షెడ్యూల్ ఇలాగే ఉంటుంది.

గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో సీఐఐ నిర్వహించిన పవర్ ప్లాంట్ సదస్సు సందర్భంగా ఈ ఏడాదికిగాను ఎనర్జీ ఎఫీషియన్సీ అవార్డును అందుకుంటున్న రామగుండం ఎన్టీపీసీ ఆపరేషన్ విభాగం జీఎం సింఘూరాయ్, ఏజీఎం మనోజ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

జీసీసీల అడ్డా తెలంగాణ: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జీఎఫ్ లైఫ్ టెక్ కొత్త గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభంతో తెలంగాణ.. ప్రపంచ స్థాయి సాంకేతిక, నూతన పరిశోధనల గమ్యస్థానంగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ సెంటర్ వల్ల ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు లభించాయని, వచ్చే మూడేండ్లలో ఈ సంఖ్య 500 దాటగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటైన జీఎఫ్ లైఫ్ టెక్ జీసీసీని గురువారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ కేంద్రం నుంచి జీఎఫ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కస్టమర్లకు అత్యుత్తమ సేవలను అందించగలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఒక్కరోజే రూ.2,000 పెరిగిన వెండి ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: వెండి ధరలు గురువారం భారీ ఎత్తున పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఒక్కరోజే కిలో రూ.2,000 ఎగబాకి రూ.87,000 పలికింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో కదలాడుతున్నాయి. మరోవైపు బంగారం ధర తగ్గింది. 24 క్యారెట్ తులం రూ.250 దిగి రూ.74,350గా ఉన్నది. 22 క్యారెట్ రూ.74,000గా నమోదైంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రూ.73,150గా ఉంటే, 22 క్యారెట్ 10 గ్రాములు రూ.67,050గా ఉన్నది. బుధవారంతో చూస్తే రూ.100 మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 2,547.70 డాలర్లు, సిల్వర్ 29.16 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

ప్రాజెక్ట్ ఇంక్లూజన్‌తో మహిళలకు చేయూత: వీ-హబ్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మహిళలకు చేయూతనిచ్చేలా ప్రాజెక్ట్ ఇంక్లూజన్ ఎంతగానో సహకరిస్తుందని వీ-హబ్ సీఈవో సీతా పల్లాచొల్ల తెలిపారు. గురువారం ఇక్కడి వీ-హబ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రాజెక్ట్ ఇంక్లూజన్ కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీ-హబ్ కృషి చేస్తున్నదన్నారు. అదేవిధంగా మహిళలు ఆంత్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తున్నామని వివరించారు. కాగా, మోడల్ ఎంఎస్ఎంఈల అభివృద్ధి, స్థాపనకు 6 నెలలపాటు ప్రాజెక్ట్ ఇంక్లూజన్ సాగుతుందని సీత స్పష్టం చేశారు. దీనికి రీసస్టైనబులిటీ సంస్థ సీఎస్ఆర్ భాగస్వామిగా ఉందని వెల్లడించారు.

ప్లాస్టో ప్లాంట్‌లో రెన్యువబుల్ ఎనర్జీనే

హైదరాబాద్, సెప్టెంబర్ 12: ప్లాస్టిక్ నీటి ట్యాంకులు, పైపులు, ఫిట్టింగ్స్ తయారీలో ప్రముఖ సంస్థగా ఉన్న ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. తమ తయారీ కేంద్రాన్ని పూర్తిగా రెన్యువబుల్ ఎనర్జీతోనే నడిపిస్తున్నది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 52 ఎకరాల్లో ఉత్పాదక కేంద్రం ఉన్నది. దీని నెలవారీ ఉత్పత్తి సామర్థ్యం 20 కోట్ల లీటర్ల వాటర్ ట్యాంకులు. కాగా, నాగ్‌పూర్ ప్లాంట్ 100 శాతం రెన్యువబుల్ ఎనర్జీ ఆధారిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌గా మారడానికి సమీపంలోగల నందూర్బార్‌లోని రెండు విండ్‌మిల్స్‌లో తయారైన గ్రీన్ ఎనర్జీనే దోహదం చేసినట్టు సంస్థ తెలిపింది.

మందగమనంలో పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి మందగించింది. ఈ ఏడాది జూలైలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 4.8 శాతానికే పరిమితమైంది. నిరుడు జూలైలో 6.2 శాతంగా ఉండటం గమనార్హం. తయారీ, గనుల రంగాల పేలవ ప్రదర్శనే ఈ క్షీణతకు కారణమని గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. గతంతో పోల్చితే గనుల రంగంలో ఉత్పాదకత 10.7 శాతం నుంచి 3.7 శాతానికి, తయారీ రంగంలో 5.3 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో స్వల్పంగా పెరిగి 3.65 శాతంగా నమోదైంది. అంతకుముందు జూలైలో 3.6 శాతంగా ఉన్నది.

ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న అమెరికా ప్రతినిధులు

- **అమెరికా వైద్య బృందం ప్రతినిధులు**

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 12: ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలని అమెరికా వైద్యబృందం ముఖ్య ప్రతినిధి ఎయిడ్స్ రిలీఫ్‌పేఫార్ ట్రాసీలైన్ క్యారసాన్ సూచించారు. గురువారం జిల్లా జనరల్ దవాఖానలోని ఏఆర్‌టీ సెంటర్‌ను అమెరికా వైద్య బృందం ప్రతినిధులు తనిఖీ చేశారు. రాష్ట్రంలోని అన్ని ఏఆర్‌టీ సెంటర్‌లో ఎయిడ్స్ బాధితుల వైద్యసేవలకోసం నిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ సెంటర్ల పనితీరుపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పద్మ, డాక్టర్ సందీప్‌కుమార్‌సింగ్‌తో సమావేశమయ్యారు. కార్యక్రమంలో త్రిష్టాఅంబార్ బిగాం, మెథీస్‌రా బర్ట్‌గ్రాండీ, కార్లాన్‌మారీహాల్ పాల్గొన్నారు.

ప్రజాపాలన టీంలు తయారు చేయాలి

- **కలెక్టర్ సిక్తాపట్నాయక్**

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 12: గ్రామాల్లో ప్రజాపాలన టీంలు తయారు చేసి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని కలెక్టరేట్‌లో ప్రజాపాలనపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో పనిచేసిన టీంల గురించి, ఈజీఎస్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

సకాలంలో పంట రుణాలు ఇవ్వాలి

బ్యాంకర్లు సకాలంలో పంట రుణాలు ఇవ్వాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్‌ఆర్‌సీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్యాంకులు పంటరుణాలను రెన్యూవల్‌చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం కేంద్రఐటీశాఖ ఆధ్వర్యంలో పీఎంఈజీపీ ద్వారా వందమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు 100 మోడల్ సీఎస్‌సీలు స్థాపించేందుకు అనుమతి మంజూరు చేస్తూ ప్రాజెక్టు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశాల్లో ట్రైనీకలెక్టర్ గరిమా నరుల, డీఆర్డీవో మొగులప్ప, డీపీవోకృష్ణ, డీఏవో జాన్‌సుధాకర్, బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిషేధించాలి

జిల్లాలో మాదకద్రవ్యాలను నిషేధించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయశాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

'రాహుల్‌ను పార్టీ నుంచి బహిష్కరించాలి'

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 12: దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా విదేశాల్లో మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని కాంగ్రెస్‌పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సత్యానారాయణ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వెంకటయ్య పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులు, ప్రతిభా పురస్కారాలు

ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 12 : జిల్లా కేంద్ర ంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జిల్లా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డు లు, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులు, ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అంతకుముందు జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రముఖ వైద్య నిపుణుడు మధుసూదన్‌రెడ్డి, బెక్కెంజనార్దన్, రాంచందర్‌జీ పాల్గొన్నారు.

నేడు ఉద్యోగమేళా

పాలమూరు, సెప్టెంబర్ 12: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫ్లిప్‌కార్ట్‌లో సార్టింగ్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ బాయ్స్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 13న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్డీవో నర్సింహులు బుధవారం ప్రకటలో తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ తాసీల్దార్ కార్యాలయ సమీపంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉద్యోగమేళా నిర్వహిస్తామని, 18 నుండి 35ఏండ్ల వయస్సు, పదో తరగతి ఉతీర్ణులై, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన పురుషులకు ప్రాధాన్యం ఉంటుదన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక య్యే వారు మహబూబ్‌నగర్, జోగుళాంబ, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ ప్రాం తాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆధార్‌కార్డు, పాస్‌ఫోటోలు, విద్యార్హతల ప త్రాలతో హాజరుకావాలని సూచించారు.

రోడ్డుప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

నారాయణపేట, సెప్టెంబర్ 12: పట్టణంలోని యాద్గీర్ రోడ్డు నుంచి సింగారం చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. గమనించిన పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టా రు. ఎస్సై వెంకటేశ్వర్లు గురువారం కంకర మి శ్రమంతో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేయించారు. ఏఎస్సై ఆంజనేయు లు, పీసీలు గోపాల్, నర్సింహా, హెచ్‌జీ సుధాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

మహ్మదాబాద్, సెప్టెంబర్ 12: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు 12నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని, పెండింగ్ వేతనాలు వెంటనే ఇప్పించాలని తాసీల్దారు తిరుపతయ్యకు జీపీ కార్మికులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాదిపాటు జీతాలు ఇవ్వకుంటే కుటుంబపోషణ ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. అనారోగ్యంతో బాధపడుతూ కూడ పారిశుధ్య పనులు చేస్తున్న తమ బాధను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నేటినుంచి పంచాయతీ కార్మికులందరం సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించాలని తాసీల్దార్ కోరారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న కొండన్న

నారాయణపేట, సెప్టెంబర్ 12: అకాల వర్షాలతో భారీగా నష్టపోయిన రాష్ట్ర ప్రజలను ఆ దుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతివృష్టిని జాతీయవిపత్తుగా ప్రకటించాలని సీ పీఐ జిల్లా కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశా రు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలకు పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు, చనిపోయినవారికి రూ.10లక్షల పరిహారం అందజేయాలన్నారు. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, ప్రతివర్షబాధిత కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసహాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేశ్, సంతోష్, నర్సింహులు, చెన్న ప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ.5లక్షల క్యాష్‌బ్యాగ్ చోరీ

మరికల్, సెప్టెంబర్ 12: మండల కేంద్రంలో రాత్రి 8గంటల సమయంలో అంతరా ష్ట్ర ప్రధాన రహదారిపై ఐటీసీ కంపెనీకి చెందిన వాహనం నిలిపి, కిరాణా దుకాణంలో వస్తువులు దించి చూడగా.. వాహనం నుంచి గుర్తు తెలియని వ్యక్తి రూ.5లక్షల క్యాష్‌బ్యాగ్‌ను త స్కరించినట్లు బాధితులు మరికల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయమై దర్యాప్తు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. దొంగతనం జరిగిన దృశ్యాలు సీసీ పుటేజీలో రి కార్డు అయినట్లు తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 12: ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి అని పాలమూరు యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం రాత్రి పీయూ వద్ద ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సంధ్యకార్తిక్‌మాదిగ, పీయూ జేఏసీ చైర్మన్ బత్తినిరాము, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్, దేవరాజ్, గణేశ్, వంశీ, వెంకటేశ్, ఆంజనేయులు, శివ పాల్గొన్నారు. సీపీఐ(ఎం)జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, కురుమూర్తి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రతి విద్యార్థికి యూనిఫాం అందించాలి

హన్వాడ, సెప్టెంబర్ 12: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి దుస్తులు తప్పనిసారిగా అందించాలని డీఆర్డీఏ పీడీ నర్సింహులు సూచించారు. గురువారం మండల మహిళా సమాఖ్య భవనంలో మండలంలోని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు విద్యార్థుల యూనిఫాం అందించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో దాదాపుగా 5వేలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుదర్శన్, ఎంఈవో రాజునాయక్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కిష్ట్యానాయక్ పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

నారాయణపేట, సెప్టెంబర్ 12: పట్టణంలోని సరాఫ్‌బజార్‌కు చెందిన అశోక్‌పసారి కిరా ణా దుకాణంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి నిషేధిత గుట్కాప్యాకెట్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎ స్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టుబడిన గుట్కాప్యాకెట్ల విలువ రూ.10,555 ఉంటుందని, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అశోక్‌పసారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యూడీఐఎస్‌ఈ, డీసీఎఫ్ విధానంపై శిక్షణ

జడ్చర్ల, సెప్టెంబర్ 12: జడ్చర్ల మండలంలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్‌మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్, డీసీఎఫ్ విధానంపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డేటాను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి సబ్మిట్ చేసే పూర్తి విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్చర్లలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈవో మంజులాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం అన్ని పాఠశాల హెచ్‌ఎంలు వారి పాఠశాలలో డీసీఎఫ్ ఫాంలు ఎమ్మార్సీలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, జీహెచ్‌ఎంలు, హెచ్‌ఎంలుపాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను నియమించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 12: కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నా యకుడు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఇంటర్ విద్యాధికారి ఉమామహేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. చిన్న చింతకుంట, మహమ్మదాబాద్ జూనియర్ కళాశాలల్లో సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపకులు లేక విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

విజయ్‌నగర్ కాలనీలో అంధకారం

చిమ్మ చీకట్లో జడ్చర్లలోని విజయనగర్‌కాలనీ రోడ్లు

జడ్చర్ల, సెప్టెంబ ర్ 12: మున్సిపాలిటీలోని విజయనగర్‌కాలనీలో వీధిలైట్లు లేకపోవడంతో అంధకా రం నెలకొందని కాలనీవాసులు తె లిపారు. దాదాపు గా 20రోజులుగా వీధిలైట్లు వెలగ డం లే దని, రాత్రయితేచాలు చిమ్మచీకటి కారణంగా బయటకు రాని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఆరుబయట విషపురుగులు తిరిగే అవకాశం ఉన్నందున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగలు వచ్చినా ఎవరికి తెలవడం లేదని వాపోయారు. వార్డు సభ్యుడికి సమస్యను తెలిపితే డబ్బులు లేవని సమాధా నం ఇచ్చాడని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించిన వీధిలైట్లు వేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.